కనిపెట్టుకు ఉండడాన్ని గురించి

ఏకార్యముకోసమైనా ఏ వస్తువుకోసమైనా మరి యే యితర విషయముల కోసమైనా కనిపెట్టుకు ఉండడమనేది మానవులకు సహజమని తోస్తుంది. ఏకాలములోనూ ఏ దేశములోనూ ఏదో ఒకదానికోసమై కనిపెట్టుకు ఉండనివాళ్ళు ఉండరు. అట్లా ఉండకపోవడమనేది అస్వాభావికము. మానవ సంఘములో కనిపెట్టుకుఉండడ మనేకార్యము లోపించినట్లయితే ఆ సంఘము నిలిచి ఉండ దనే తోస్తుంది. బీదవాడు హఠాత్తుగా తనకు ధనలాభము కలుగుతుందని జీవితకాలమంతా కనిపెట్టుకు ఉంటాడు. భారతీయులు స్వరాజ్యలాభానికై నిరూపించడానికి వీలులేనంతకాలము కనిపెట్టుకు ఉంటారు. గ్రంథకర్త కీర్తికోసమై చిరకాలము కనిపెట్టుకు ఉంటాడు. సర్వసంగపరిత్యాగము చేసిన సన్న్యాసి సైతము ముక్తికాంతకోసము ఎదురుతెన్నులు చూస్తూ కనిపెట్టుకు ఉంటున్నాడు. ఇక ఇతరులసంగతి చెప్పడమెందుకు?

కనిపెట్టుకు ఉండడమనే ఈ కార్యము ఒక్క మానవులలోనే కాకుండా మృగములలోనూ, వృక్షములలోనూ కూడా కానవస్తున్నది. చెట్లు, పూయడానికిగాని, కాయడానికిగాని సరియైన ఋతువువచ్చేవరకూ కనిపెట్టుకొని ఉంటవి. ఈ విషయములోనేకాకుండా యితర విషయములలోకూడా జంతువులు కనిపెట్టుకొని ఉండడము మనము చూస్తున్నాము. మోకాలిలోతు నీళ్లల్లో నిలబడి తననీడ తాను చూచు

కొంటూ కదలకుండా మెదలకుండా ఏకాగ్రచిత్తముతో— కేసులకోసం కనిపెట్టుకొనిఉండే కొత్తప్లీడరులాగ—ఏదైనా ఒకచేప సందర్భపడుతుందా దానిని నోట్లో వేసుకొందామా అని తపస్సుచేసే కొంగ, కనిపెట్టుకొని ఉండడ మనేకార్యములో ఆరి తేరి ఉన్నది. ఏకాగ్రచిత్తము, నిశ్చలమైన మనస్సు, ఆశాపూరితమైన హృదయము, శమము, దమము మొదలైన సుగుణము లాసమయమున ఆకొంగలో మూర్తీభవించి ఉంటవనే సంగతి అందరికీ తెలిసినదే. కనిపెట్టుకు ఉండడములో కొంగనుమించినవా రెవరూ సృష్టిలో లేరని చెప్పవచ్చును. ఈజంతువునుబట్టే కనిపెట్టుకొని ఉండడమనేది కళ అని మనము గ్రహించవచ్చును. అరవైనాలుగు కళల లోనూ మన పూర్వులు దీన్ని ఒకదాన్నిగా చెప్పకపోవడానికి కారణము ఊహించడము కష్టము. ఆకాలములో జనులకు కనిపెట్టుకు ఉండడము అవసరములేకుండా ఉండేదేమో? ఈసంగతి నిర్ధారణచేసి చెప్పడానికి సరియైన శాసనాది చారిత్రక నిదర్శనము లేమీ లేనట్లు తోస్తుంది. కాని ఊహానుబట్టిచూస్తే వారు కనిపెట్టుకుఉండేవారనే తోస్తుంది. ఈ కాలములోకంటె ఆకాలములో తద్దినాలు ఎక్కువ భక్తిశ్రద్ధలతో పెట్టేవా రనేవిషయము నిర్వివాదము. అటువంటి సంగతిలో నాటికీ నేటికీ మానవ స్వభావములో మార్పులు జాస్తీగాలేవు. కాబట్టి వారు తద్దినపు బ్రాహ్మలకోసము కనిపెట్టుకుఉండలేదని ఎట్లా చెప్పగలము? పెళ్లిళ్లల్లో భోజనాల సమయమున వీరు వస్తారు వారు వస్తారని పగలూ రాత్రీ రెండుజాములు దాటేవరకూ కనిపెట్టుకు ఉండలేదని ఎట్లా

చెప్పగలము? జాగ్రత్తగా ఆలోచించిచూస్తే చాలావిషయాలలో వారు కనిపెట్టుకు ఉండేవారనే స్పష్టపడుతుంది. కాని ఈ కార్యమును వారు చతుష్షష్టికళలలో ఎందుకు చేర్చ లేదో? ఒకవేళ ఈకార్యము ఆ కాలములో లేదేమో! ఈకాలములో బ్రిటిషు దొరతనమువల్ల మనకు కలిగిన మేళ్లల్లో ఇదికూడా ఒక మేలేమో అని మొదట అభిప్రాయపడేవారు. పై సంగతులను చూచి తమ అభిప్రాయమును మార్చుకోవలసి ఉంటుంది.

మన పూర్వులు దీనిని కళగా గ్రహించకపోవడానికి కారణము ఒకటి తోస్తుంది. ఈ కాలములో కనిపెట్టుకు ఉండడమంటే దుర్బల శరీరులమైన మనకు చీదరగాఉంది. దేనికోసమైనా కనిపెట్టుకొనిఉండే ఇతరులను మనము చూడడము తటస్థించినప్పుడు వారిలో ఉండేసుగుణములు మనమనస్సుకు తట్టి ఆ కార్యమును మనము కళగా భావించడము తటస్థిస్తున్నది. పూర్వముకంటె ఇప్పుడు, — రైలుస్టేషనులదగ్గిరా, పోస్టాఫీసులదగ్గిరా, అధికారుల యిళ్లదగ్గిరా యింకా యితర ప్రదేశములలోనూ కనిపెట్టుకు ఉండడము సంభవిస్తుండడముచేత దాని బాగోగులు మనకు బాగా అనుభవములోకి వస్తూఉన్నవి. పూర్వుల అనుభవములు విరివిగా లేకపోవడముచేత వారీ కార్యమును అంతగా లెక్కచేసేవారుకారు. కాబట్టి వారు దీనిని కళగా భావించకపోయి ఉండవచ్చు. కనిపెట్టుకు ఉండవలసి వచ్చిందనే జ్ఞానము వారికి లేకపోవడమున్నూ, ఎప్పటి కప్పుడు కనిపెట్టుకు ఉండవలసివచ్చిందే అనే జ్ఞానమూ, తొట్రుబాటూ, దానినిగురించి చింతనా

మనకు ఉండడమువల్లనూ వారికీ మనకూ ఈ కార్యము విష యమై అభిప్రాయభేదము కలిగినదని తోస్తుంది. కనిపెట్టుకు ఉండడమనే జ్ఞానము మనకు కలగడమునకు కారణము నేటి నాగరికత అని చెప్పితే సత్యదూరము కాదు.

కనిపెట్టుకు ఉండడమనే కార్యము సరియైన మార్గమును బట్టిపోతే కళగా మనము భావించవచ్చును, గాని దానిని తప్పుతోవల వెంబడితిప్పితే అది కళ అనిపించుకోదు. కని పెట్టుకు ఉండడానికి కారణమూ, దానివల్ల కలిగే లాభమూ, ఆకార్యమును నిర్వహించడానికి చూపే చాకచక్యమూ మున్నగు లక్షణాలు పట్టినప్పుడే అది ప్రశంస చేయదగిన దవుతుంది. చేపను పట్టడానికి కొంగా, ఎలకను పట్టడానికి పిల్లీ, గోడకుకొట్టిన లాంతరుదగ్గిర పురుగులను పట్టడానికి బల్లీ, ఈగలను పట్టుకోవడమునకు గూడు అల్లుకొని కూర్చునే సాలె పురుగూ, సృష్టి విచిత్రములను తెలుసుకోవడమునకు శాస్త్ర జ్ఞుడూ, క్లయింట్లను ఆకర్షించడానికి ప్లీడరూ, కనిపెట్టుకు ఉండడమనే కళలో చాకచక్యము చూపుతూవుంటారు.

రైలు ఫలానా యిన్నిగంటలకు వస్తుందని తెలిసిఉండిన్నీ అంతకుముందుగావెళ్ళి రెండుమూడు గంటలకాలము పడి గాపులు పడి కనిపెట్టుకొని ఉండేవాళ్ళనుచూస్తే ఎవరికి జాలి పుట్టదు? ఇట్టివారు కనిపెట్టుకొని ఉండడములో అందము లేదు. సాలెపురుగు కనిపెట్టుకొని ఉండడమనే కార్యమును ఇట్టివారి కార్యముతో పోల్చి చూచినట్లయితే వీరుచేసేపని కళ అనిపించుకోదని తేలుతుంది.

కాని ఎవరైనా గొప్పవారు కావలెనని ఆశించుచున్న

ట్లయితే వారు ముఖ్యముగా కనిపెట్టుకు ఉండడ మనేవిద్యను నేర్చుకోవలసిఉన్నది. గొప్పతనము చెందడానికి కావలసిన లక్షణాలు చాలా ఉన్నవని గొప్పవారు చెప్పుకోవడముకద్దు. సత్యసంధత, ధైర్యము, వాక్పాటవము, భూతదయ, భావిదృష్టి, పట్టుదల, కృషి యిత్యాదిగుణములు చాలా ఉన్నవి. ప్రతిగొప్పవాడిలోనూ ఈ గుణములన్నీ ఉన్న వన డానికి సందేహము లేదు. కాని గొప్పతనమనే సౌధము నెక్క డానికి కనిపెట్టుకు ఉండడము ఒకమెట్టు. ఈమెట్టుమీదనుంచి ఎక్కి సౌధము చేరుకున్న తరువాత ఇతరులను తమకోసము కనిపెట్టుకుఉండేటట్లు చేయడము గొప్పతనముయొక్క ప్రధాన లక్షణము అవుతూ ఉన్నది. గొప్పతనానికి అవసరమైన ముఖ్యలక్షణములలో ఇదికూడా ఒకటిగా పరిగణించవచ్చును. ఇరవై రూపాయల గుమాస్తాగా పనిచేస్తూన్న కాలములో కనిపెట్టుకు ఉండడమనే విద్య నేర్చుకొన్న ఒకమానవుడు డిప్టీకలెక్టరీపదవి పొందినట్లయితే ఇతరులను ఏరీతిగా తన కోసము కనిపెట్టుకు ఉండేటట్లు చేస్తాడో అందరికీ తెలిసిన విషయమే. ఈవిషయములో ముఖ్యముగా తెల్లదొరలు అగ్రేసరులు. ఇతరులు వారికోసము కనిపెట్టుకు ఉండజాలరు. తెల్లదొరలను అనుకరించే నల్లదొరలసంగతీ యింతే. ఒక ఊళ్లో ఒక చిన్న నల్లదొర ఉండేవాడు. ఈయనకు చిన్న ఉద్యోగము. ఆ చిన్న ఉద్యోగస్తునికింద మరీ చిన్న స్కూలు మేష్టరు లుండేవారు. ఈ చిన్న నల్లదొర పరువు మర్యాదల కోసము పాట్లుపడేజాతి మనుష్యుడు. పరువు మర్యాద లంటే వంశమునకుగాని, తనజాతికిగాని, దేశమునకుగాని సంబం

థించినవి కావు. తన ఉద్యోగమునకు సంబంధించినంత వరకే పరువుమర్యాదలు. తన ఉద్యోగపదవికి అగౌరవమువస్తే సహింపజాలడు ఆయన. ఒకనాడు ఒక చిన్న బడిపంతులు అర్జీపట్టుకొని ఈ చిన్న నల్లదొరదగ్గరకు వచ్చాడు. ఈ చిన్ననల్లదొర తలపాగాతో, ముక్కద్దములతో బల్లవెనక కుర్చీలో కూచుని ముందున్న కాగితాలు దర్జాగా తిలకిస్తూన్న సమయములో బడిపంతులు అర్జీతెచ్చి నమస్కారముచేశాడు. ఉద్యోగగౌరవము మూర్తీభవించినట్లు కూర్చున్న ఆ నల్లదొరకోసము ఉద్దేశింపబడిన ఆ నమస్కారము ముందుబల్లకు తగిలి ఉండవచ్చును. నమస్కరించిన పిమ్మట నడుమువంచి చేతులు చాచి అర్జీని చేతులలోనుంచి అందిచ్చేటట్లు పట్టుకొని వడుకుతున్నాడా చదువులయ్య. ఎవరినీ గమనించకుండా నల్లదొర తదేకదృష్టితో కాగితములు చూస్తూన్నాడు. ఐదు నిమిషములు గడచినవి. పది నిమిషములు గడచినవి. పావుగంట గడచినది. బడిపంతులు చేతిలో కాగితము గడగడ వణకుతున్నది. చివరకు సులోచనములు పైకి లేచినవి. నల్లదొర బడిపంతులకేసిచూచి, అర్జీకేసిచూచి వెనక్కుతిరిగి "ఇప్పుడు కాదు; తర్వాత తర్వాత" అని ఉత్తరువుచేశాడు. బడిపంతులు బుర్రవంచుకు వెళ్లిపోయాడు. కనిపెట్టుకు ఉండడమంటే అది; కనిపెట్టుకు ఉండేటట్లు చేయడమంటే అది.

కనిపెట్టుకు ఉండడాలు అనేకరకములు. గవర్నమెంటు ఉద్యోగములో ప్రమోషన్ అవుతుందని కనిపెట్టుకుఉండడము, ఉరిశిక్ష పడినవాడు ఉరిత్రాటికోసము కనిపెట్టుకు ఉండడము, ప్రకటించడానికి ఒక పత్రికకు వ్యాసమో,

పద్యమో పంపించి అది ఎప్పుడు ప్రకటిస్తారు దైవమా అని కనిపెట్టుకు ఉండడము, స్వరాజ్యము కోసము కనిపెట్టుకు ఉండడము, ఎప్పటికైనా జాతకము బాగుపడదా అని కనిపెట్టుకు ఉండడము, ఇవి కొన్నిరకములు.

మానవులలో రెండు తెగలు: కనిపెట్టుకు ఉండగలిగినవారు, కనిపెట్టుకు ఉండలేనివారు. మొదటి తెగవా రుత్తములు. వారిని సాధారణముగా మనము పెద్ద ఉద్యోగస్తుల యిళ్ల ముందర చూస్తూఉంటాము. రెండవ తెగ మనుష్యులు మధ్యములు. వారికి ఓర్పు మున్నగు మంచిగుణములు లేవు. ఇటువంటివారు లోకములో నెగ్గలేరు. ఇక కొందఱు మనుష్యులు దొరల యిళ్లదగ్గిర కనిపెట్టుకుఉండడాని కిష్టపడతారుగాని తమతో తుల్యులైన వారికోసము మాత్రము కనిపెట్టుకొని ఉండజాలరు.

మొత్తముమీద కనిపెట్టుకు ఉండడమనేది మంచి కార్యమే. దానివల్ల వినయమూ, ఓర్పూ, ఆశాపూరిత హృదయమూ, మానవస్వభావమును గ్రహించడానికి తగిన అవకాశమూ, దివాస్వప్నముల కవకాశమూ, కలుగుతున్నవి.

1926